



సంక్రాంతి శోభ

వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెలో జల్లికట్టు ఉత్సాహం

చిత్తూరులో గంగిరెద్దు సందడి

పల్లెలన్నీ సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. జంగమదేవర్ల భవిష్యవాణి,గొబ్బి పాటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల భజనలతో గ్రామాలు సందడిగా మారాయి. పండగ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రమైన చిత్తూరులో బట్టల దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. వెదురు కుప్పం మండలం పెరుమాళ్లపల్లెలో ఆదివారం జల్లికట్టు హుషారెత్తించింది. కొందరు గిత్తల కిందపడినా లెక్కచేయకుండా పోరాడి బహుమతులను దక్కించుకున్నారు.

-చిత్తూరు కల్చరల్/వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి



చిత్తూరు సమీపంలోని మంగళపల్లె ఆలయం వద్ద గొబ్బి పాటలు

కుటుంబ కలహాలకు మరో ఇద్దరు పిల్లల బలి

నగరి వుదంతం మరువకముందే సదుంలో అలాంటి సంఘటన



సదుం ఆస్పత్రి మార్చురీలో షేక్ సిర్దా, షేక్ జారా ఫాతిమా మృతదేహాలు

సదుం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలకు మరో ఇద్దరు పిల్లలు బలైపోయారు.నగరిలో శనివారం ఇద్దరు ఆడ పిల్లలను తల్లే బావిలో తోసేయగా చనిపోయిన విషయం మరువక ముందే అత్త మీద కోపంతో ఓ తల్లి క్షణికావేశంలో తన ఇద్దరు పిల్లల్ని కడతేర్చిన సంఘటన ఆదివారం సదుంలో వెలుగు చూసింది.అత్తతో జరిగిన వాగ్వాదంతో మనస్తాపం చెందిన ఆమె , తన ఇద్దరు పిల్లలకు తానే ఉరి వేసి చంపేయడమే కాకుండా తానూ ఆత్మహత్యకు యత్నించింది. దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు తేరుకునేలోపు పిల్లలిద్దరూ విగతజీవులుగా మారిపోగా, తల్లి మాత్రం ప్రాణాపాయం నుంచి బయటపడింది.పోలీసుల కథనం మేరకు.... సదుం మసీదు వీధిలో షేక్ మన్సూర్ తన తల్లి గవహర్ జాన్, భార్య షేక్ కరిష్మా(27), కుమార్తెలు షేక్ సిర్దా(2), షేక్ జారా ఫాతిమా(1)లతో కలిసి కాపురం ఉంటున్నాడు. అత్తా కోడళ్లైన కరిష్మా, గవహర్ జాన్ మధ్య తరచూ వాగ్వాదం జరుగుతుండేది. ఆదివారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతం లోనూ వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కరిష్మా తన ఇద్దరు పిల్లలను ఇంటిలోని పైఅంతస్థులోని గదిలోకి తీసుకెళ్లి విద్యుత్ వైర్లతో ఉరి వేసేసింది. ఆ తరువాత తాను కూడా ఉరి వేసుకుంది. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు గది తలుపులు పగలగొట్టి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. హుటాహుటిన సదుం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారులిద్దరూ మరణించారని వైద్యులు తేల్చారు. కరిష్మా మాత్రం గొంతు వద్ద గాయంతో బతికి బయటపడింది.పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెలుగులోకి రావాల్సి ఉంది.

కంటిపాపలను కాపాడుకుందాం

- చిన్నారుల్లో పెరుగుతున్న కంటి సమస్యలు
- వందమందిలో ఐదుగురికి తప్పని కళ్లజోడు



ప్రభుత్వ పాఠశాలలో కంటి పరీక్షలు

చిత్తూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో కంటి సమస్యలు పెరిగిపోతున్నాయి.ఐదు శాతం పిల్లలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని అంచనా.గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉన్నట్లు సమాచారం.కొవిడ్ రాక ముందు పిల్లలు హాయిగా బయటికి వెళ్లి ఆడుకునేవారు. లాన్‌డౌన్ సమయంలో చాలాకాలం ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చింది. క్లాసులకు కూడా ఆన్‌లైన్ విధానంలో ట్యాబుల్లోనే హాజరయ్యేవారు. అప్పటి నుంచి పిల్లలకు స్ర్కీన్ వాడకం బాగా పెరిగింది. తల్లిదండ్రులు కూడా వాళ్లను ఎలా డీల్ చేయాలో తెలియక సెల్‌ఫోన్లను, ట్యాబులను చేతికి ఇవ్వడం అలవాటు చేసుకున్నారు.ఆ అలవాటు ఇప్పటికీ కొనసాగుతోంది. నోట్సులు రాసుకోవడం, క్లాసులు వినడం ఇప్పటికీ సెల్‌ఫోన్లలో, ట్యాబుల్లో చేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే పిల్లల్లో కంటి సమస్యలు మరింత పెరిగే అవకాశముంది.విద్యాసంస్థలు కూడా ఈ విషయంపై ఆన్‌లైన్ టీచింగ్ తగ్గించాల్సి ఉంది. తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లలకు సెల్‌ఫోన్లు చేతికి ఇవ్వకుండా, టీవీల్లో అవే బొమ్మలు వేసి దూరంగా కూర్చొబెట్టి చూపించాలి. అలాగే పిల్లలకు ఉదయం, సాయంత్రం సూర్యరశ్మి తగిలేలా చూడాలి. బయటికి వెళ్లి ఆడుకోనివ్వాలి.

● 3500 మందికి కళ్ల జోడు

గత ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి అక్టోబరు 31 వరకు ప్రభుత్వ పాఠశాలల్లోని 7-10 తరగతి విద్యార్థులకు 'ఐ స్ర్కీనింగ్ ప్రోగ్రామ్'ను నిర్వహించారు.76,629 మంది పిల్లల్ని పరీక్షించగా.. 3500మందికి కంటి సమస్యలున్నట్లు గుర్తించారు. కళ్ల జోడు అందించేందుకు ఎంపిక చేశారు.పిల్లల్లో కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని గ్రహించిన ప్రభుత్వం వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఆర్‌బీఎస్‌కే, నేత్ర వైద్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లలోని విద్యార్థులకు ఏడాది పొడవునా కంటి పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

రెగ్యులర్ చెకప్ వుండాలి

నా దగ్గరికి వచ్చే పిల్లలు ఎక్కువగా క్లాస్ రూమ్‌లో బ్లాక్ బోర్డు కనిపించడం లేదనే చెప్తున్నారు. పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వడం అనేది తల్లిదండ్రులకు ఈజీ సోర్స్ ఆఫ్ డీవియేషన్ అయిపోయింది. పోషకాహారం కంటే స్ర్కీనింగ్ టైమింగ్ ఎక్కువగా ఉండడంతోనే పిల్లలకు సమస్య వస్తోంది. కంట్లో మైనర్ పవర్ పెరుగుతుంది. స్కూల్స్‌లో ఐ చెకప్ రెగ్యులర్‌గా జరగాలి. అలా లేకుండా తల్లిదండ్రులే చేయించాలి. సమస్య ఉన్నవారు వైద్యుల సూచన మేరకు కళ్ల జోడు సరిగా వాడాలి.



-డాక్టర్ గీతా అనూష,చిత్తూరు అపోలో ఆస్పత్రి

విటమిన్ ఎ మీద దృష్టి పెట్టాలి



విటమిన్ ఎ లోపంతో కంటి సమస్యలు వస్తున్నాయి. పిల్లల్లో పోషకాహారం లోపం కూడా ఉంది. ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోను చూడడం కంటి సమస్యకు ప్రధాన కారణం. 7వ తరగతి పైబడిన పిల్లల్లో కంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకుని విటమిన్ ఎ వుండే ఆహారం అందించడంపై, సెల్‌ఫోన్‌ను దూరంగా ఉంచడంపై దృష్టి పెట్టాలి.

- అర్పిత, జిల్లా అంధత్వ నివారణ అధికారి

ఐదు నెమళ్ల మృత్యువాత

రామకుప్పం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల పంచాయతీ లక్ష్మీపురం సమీపంలోని అటవీ సరిహద్దుల్లో ఐదు నెమళ్లు మృత్యువాత పడ్డాయి. ఆదివారం ఉదయం స్థానికులు రెండు నెమళ్లు చనిపోయి ఉండటాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీ ఉపక్షేత్రాధికారి ధనంజయుడు సిబ్బందితో రాగా అక్కడికి చేరువలోనే శాంతిపురం మండలం శివరామపురానికి చెందిన రైతు రమేష్‌రెడ్డికి చెందిన పొలం పక్కనే మరో మూడు నెమళ్లను పూడ్చిపెట్టారని చెప్పారు. దీంతో చుట్టుపక్కల గాలించి పూడ్చిపెట్టిన ఐదు నెమళ్ల కళేబరాలను వెలికి తీశారు. రమేష్‌రెడ్డి తన పొలంలో పుచ్చకాయలను సాగు చేస్తున్నాడు. వన్యప్రాణులు తోటల వైపు రాకుండా తోట చుట్టూ విషపు గుళికలు చల్లాడని.. అవి తిన్నందునే నెమళ్లు మృత్యువాత పడ్డాయని స్థానికులు, అటవీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. చనిపోయిన నెమళ్లను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నట్టు ధనంజయుడు తెలిపారు. ఫలితాలు వచ్చిన అనంతరం చర్యలు చేపడతామన్నారు.



పూడ్చిపెట్టిన నెమళ్లను వెలికి తీసిన అటవీ శాఖ అధికారులు

గ్యాస్ ప్రాజెక్టుల ప్రారంభం.. సంతోషదాయకం

- తిరుచానూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కార్పొరేషన్‌కు గ్యాస్‌తో నడిచే వాహనాల అప్పగింత



గ్యాస్‌తో నడిచే వాహనాల తాళాన్ని కమిషనరు మౌర్యకు అందజేస్తున్న చంద్రబాబు

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి సీఎన్‌జీ, పీఎన్‌జీ ప్రాజెక్టులను ప్రారంభించడం సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోనే అతిపెద్ద సహజవాయు ఉత్పత్తి సంస్థల్లో ఒక్కటైన ఏజీ అండ్ పీ - ప్రథమ్ థింక్ గ్యాస్ సంస్థ తిరుపతిలోని తాజ్ హోటల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజీ అండ్ పీ కంపెనీ ఏర్పాటు చేసిన సీఎన్‌జీతో నడిచే వివిధ రకాల వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ కోసం గ్యాస్‌తో నడిచే వాణిజ్య వాహనాలను మున్సిపల్ కమిషనర్ మౌర్యకు అప్పగించారు. ఆ తర్వాత కార్యక్రమ నిర్వాహక సంస్థ రేణిగుంట మండలం గాజులమండ్యంలో ఏర్పాటు చేసిన సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కును.. సీఎన్‌జీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌నూ ఆయన ప్రారంభించారు. ఇక్కడి నుంచే చిత్తూరులో ఏజీ అండ్ పీ ప్రథమ్ థింక్ గ్యాస్ సీఎన్‌జీ మదర్ స్టేషన్‌ను ప్రారంభించి, నెల్లూరులో ఎస్‌సీఎన్‌జీ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో ఏజీ అండ్ పీ కంపెనీ రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో పది వేల మందికి ఉపాధి అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ సంస్థకు తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏజీ అండ్ పీ సంస్థ ఎండీ, సీఈవో అభిలేష్ గుప్తా, మంత్రులు బీ.సి.జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు అరణి శ్రీనివాసులు, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, గాలి భానుప్రకాష్, డాక్టర్ థామస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తదితరులతో పాటు పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఏమ్మా టీ టేస్ట్ ఎలా ఉంది?

- ఇంటింటికి గ్యాస్ సరఫరా ప్రారంభించి.. లబ్ధిదారు ఇంట టీ పెట్టిన చంద్రబాబు

ఏమ్మా.. టీ ఎలా ఉంది?
కప్పు చేతికందించి సీఎం చంద్రబాబు వేసిన ప్రశ్న

సర్, మా ఇంట్లో మీరే టీ పెట్టి మాకివ్వడం మహాభాగ్యం.
ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ లీలావతి ఇచ్చిన సమాధానమిది.

తిరుచానూరులో శరవణ, లీలావతి దంపతుల ఇంటికి అమర్చిన ఏజీ అండ్ పీ అనే సంస్థకు చెందిన డొమెస్టిక్ పైపులైన్ నేచరల్ గ్యాస్ సరఫరాను సీఎం చంద్రబాబు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఆయన లబ్ధిదారు ఇంట్లో గ్యాస్ స్టవ్ వెలిగించి టీ పెట్టారు. ఆ దంపతులకు టీ అందజేసి తానూ తాగారు. ఏమ్మా..! టీ బాగుందా.. అంటూ సరదాగా అడిగారు. చాలా చక్కగా ఉందంటూ ఆనందం వ్యక్తంచేశారు. పైపులైన్ సరఫరా వల్ల గ్యాస్ అయిపోయిందనే సమస్య లేదని వాళ్లు సీఎంతో అన్నారు. మీటరులో రీడింగ్ మేరకు వాడిన గ్యాస్‌కు ప్రతి నెలా కట్టాల్సి ఉంటుందన్నారు. మాటల మధ్యలో సీఎం చంద్రబాబు శరవణ కుటుంబ స్థితిగతులను ఆరా తీశారు. 'నేను కార్పెంట్ వర్క్ చేస్తాను. గతంలో ఆవులు ఉండటంతో కుటుంబ పోషణ జరిగేది. అవి చనిపోయాయి' అని వారు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. 'శరవణా.. లీలావతి, మీరు భయపడవద్దు, పీఎంఏవై కింద రూ.3లక్షలతో పాటు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్షతో కలిపి మొత్తం రూ.4లక్షలు ఇంటికి ఇస్తాం' అని అన్నారు. ఆవుల కోసం మరో రూ.2లక్షలు తక్షణ సాయం కింద అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. దాదాపు 15 నిమిషాల పాటు శరవణ కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు గడిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేసుగుణమ్మ, టీడీపీ నేతలు నరసింహయాదవ్, అమిలినేని మధు, శ్రీధర్ వర్మ, ఈశ్వరరెడ్డి, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాయి రాయల్, హరేరామ్, వాసు, కత్తి సుధ తదితరులు పాల్గొన్నారు.



లీలావతి ఇంట్లో టీ కాచి వడకడుతున్న చంద్రబాబు

ముందే వచ్చిన సంక్రాంతి

రూ.ఆరు లక్షలకు మంజూరు పత్రాలను సీఎం చంద్రబాబు అందించడంతో శరవణ, లీలావతి దంపతులు ఆనందం వ్యక్తంచేశారు. 'మాలాంటి పేదల ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు సార్ రావడం.. ఆయన దగ్గర ఉండి మాకు టీ కాచి ఇవ్వడం.. మేము అడగకుండానే మా ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని వరాల జల్లు కురిపించడం.. మా ఇంట్లో కూర్చుని 15నిమిషాలకుపైగా మాట్లాడటం.. మా జీవితంలో మరచిపోలేం. ఆయనకు మేము రుణపడి ఉంటాం. మా ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు. మాకు ఒకరోజు ముందే సంక్రాంతి వచ్చింది' అని శరవణ, లీలావతి దంపతులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తున్న సీఎం



నారావారిపల్లెలో నారా, నందమూరి కుటుంబాలు

చంద్రగిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా నారా, నందమూరి కుటుంబాలు నారావారిపల్లెకు చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం సీఎం చంద్రబాబు స్వగ్రామానికి వచ్చారు.అప్పటికే వేచి ఉన్న జనం సమస్యలు విని, వినతిపత్రాలు స్వీకరించారు. ఉదయం 11.30 గంటల సమయంలో మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ వచ్చారు. నారా భువనేశ్వరి, నారా ఇందిర, ఇతర బంధువులు శనివారమే నారావారిపల్లెకు వచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు తమ కుటుంబీకులతో పాటు నందమూరి రామకృష్ణ తదితరులతో కలిసి శేషాచలం లింగేశ్వరస్వామిని మంత్రి లోకేశ్ దర్శించుకున్నారు. అనంతరం కందులవారిపల్లెలో వినాయకస్వామిని దర్శించుకున్నారు.

నేడు సీఎంచే పలు శంకుస్థాపనలు

నారావారిపల్లెలో పలు అభివృద్ధి పనులకు సోమవారం సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేయనున్నారు. నారావారిపల్లి పరిధిలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన.. రూ.5 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమి పూజ.. రంగంపేట జడ్పీ హైస్కూలును శ్రీసిటీ సెజ్ దత్తత తీసుకునే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారు. గ్రామంలో నిరుద్యోగ యువతకు సెర్ప్ ద్వారా అందించిన 15 ఇ-ఆటోలను ప్రారంభించనున్నారు. 2 వేల ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయడం ద్వారా సౌర విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభిస్తారు. ఇప్పటికే 20 ఇళ్ళకు సోలార్ ప్యానెళ్ళు ఏర్పాటు చేయగా వాటిని చంద్రబాబు నేడు ప్రారంభిస్తారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల మానసిక సామర్థ్యాలను పెంపొందించే దిశగా కేర్ అండ్ గ్రో అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. ఈజీ మార్ట్ అనే సంస్థతో చిన్న దుకాణాలకు అవసరమైన సరుకులు, వస్తువులను సరఫరా చేసే గూడ్స్ చెయిన్‌కు ఒప్పందం కుదుర్చుకోనున్నారు.



శేషాచల లింగేశ్వర స్వామి ఆలయంలో మంత్రి లోకేశ్, భువనేశ్వరి తదితరులు

కన్న తల్లిని రోడ్డుపై వదిలేశారు..!

అన్నదమ్ముల ఆస్తుల వివాదం

నిస్సహాయ స్థితిలో 90 ఏళ్ల వృద్ధురాలు



మంచంపై లేవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు - పార్వతమ్మ

చౌడేపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల ఆస్తుల వివాదం పండు వృద్ధురాలైన కన్న తల్లిని రోడ్డుపై వదిలేసిన సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఏ కొత్తకోటకు చెందిన పార్వతమ్మ(90)కు నాగరాజు, చంద్రమౌళి ఇద్దరు కుమారులు. ఆమె అనారోగ్యంతో.. మతిస్థిమితం సరిగా లేకుండా లేవలేని స్థితిలో కొంత కాలంగా మంచానికి పరిమితమైంది. పార్వతమ్మ కుమారులిద్దరూ అదే గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. అన్నదమ్ములకు భూముల విషయంలో గొడవలు ఉన్నాయి. పార్వతమ్మ చిన్న కొడుకు చంద్రమౌళి వద్దనే ఉండేది. ఆస్తులు మాత్రం వాటాలు తీసుకున్నావు.. తల్లిని ఎందుకు చూడటం లేదని ఆదివారం మధ్యాహ్నం అదే గ్రామంలోని తన అన్న నాగరాజ ఇంటి ముందు లేవలేని స్థితిలో ఉన్న తల్లిని మంచంతో సహా తీసుకెళ్లి రోడ్డుపై వదిలి వ్యవసాయ పనులకు వెళ్లిపోయాడు. గ్రామస్తులు గుర్తించి వ్యవసాయ పనుల్లో ఉన్న పెద్దకొడుకు నాగరాజుకు ఫోన్‌లో సమాచారం అందించారు. గ్రామస్థులు తల్లిని చూసుకోవాలని నచ్చజెప్పడంతో ఇంటికి తీసుకెళ్లాడు.

పీజీఆర్‌ఎస్ కార్యక్రమం రద్దు

చిత్తూరు అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భోగి పండగ సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే వారు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు.అలాగే పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు.

టీటీడీ ఇన్‌ఛార్జి విజిలెన్స్ ఆఫీసర్‌గా చిత్తూరు ఎస్పీ

టీటీడీ ఇన్‌చార్జి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా చిత్తూరు ఎస్పీ మణికంఠను ప్రభుత్వం నియమించింది. ఆదివారం ఆయన టీటీడీ పరిపాలన భవనంలో బాధ్యతలు తీసుకున్నారు.

ఓ బోరుబావి కథ!

● రూ.కోటి ప్రభుత్వ భూమికోసం ఎడతెగని వివాదం



రోడ్డుకు పక్కనే ఉన్న ప్రభుత్వ బోరు

కుప్పం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):ప్రైవేటు పట్టా భూములను ఆనుకుని ఉన్న రూ.కోటి విలువ చేసే ప్రభుత్వ భూమికోసం, బోరుబావుల పేరుతో ఎడతెగకుండా కొనసాగుతున్న వివాదమిది.గుడుపల్లె మండలం కోటపల్లెలో రోడ్డు పక్కనే ఒక ప్రభుత్వ బోరు వుంది. ఈ బోరునుంచి గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుంది. రోడ్డుకు అటువైపు ఈ బోరుకు ఎదురుగా 45/2ఎ సర్వే నెంబరులో నారాయణ అనే వ్యక్తి భార్య జమున పేరుమీద 2.70 ఎకరాల భూమి ఉంది.మూడేళ్ల క్రితం దీంట్లో ఒక బోరు తవ్వించారు.

ఎనిమిది నెలల క్రితం అంటే వైసీపీ ప్రభుత్వం చివరి రోజుల్లో నిబంధనల ప్రకారం బోరు తవ్వకం జరిగిందని రెస్కోకు రెవెన్యూ అధికారులు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా కనెక్షన్ ఇచ్చామని రెస్కో అధికారులు చెబుతున్నారు.

ఈ బోరు వల్ల రోడ్డుకు అటువైపున్న ప్రభుత్వ బోరు ఎండిపోయి, గ్రామానికి తాగునీటి సమస్య తలెత్తుతుంది కాబట్టి వెంటనే కనెక్షన్ తొలగించమని కోటపల్లి గ్రామస్తులు ఆందోళన ఉధృతం చేశారు. బోరుకు విద్యుత్తు కనెక్షన్‌ను తొలగించారు కూడా. రెస్కో అధికారులనూ ఈ విషయంమీద నిలదీశారు. వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వ బోరుకు 250 మీటర్ల దూరంలో ప్రైవేటు బోర్లు ఏవీ వేయకూడదన్న నిబంధనను ఉల్లంఘించారు కాబట్టి, ఇలా కనెక్షన్ ఇవ్వడం అక్రమమని గ్రామస్తుల వాదన. అయితే ఈ వివాదాన్ని మొదటినుంచీ గమనిస్తున్న గ్రామస్థుల్లో కొందరి వాదన ప్రకారం 46/6 సర్వే నెంబరులో ఉన్న రూ.1.75 ఎకరాల భూమికోసం ఈ వివాదం నడుస్తోంది. రోడ్డుకు అత్యంత సమీపంలో వున్న ఈ భూమి విలువ ప్రస్తుతం కోటి రూపాయలు దాటుతోంది.జమున పేరుమీద తీసిన భూమికి, మునెప్పతో పాటు మరికొందరు రైతుల భూములకు మధ్య ఈ ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్టులో అంతకంతకూ పెరిగిపోతుండడంతో ఇరు వర్గాలకూ నడుమ బోరుబావి రూపంలో వివాదం ప్రారంభమైంది. బోరుబావికిచ్చిన విద్యుత్తు కనెక్షన్ అక్రమమని నిరూపించి, అందువల్ల ప్రభుత్వ బోరులో నీళ్లు తగ్గిపోతాయన్న కారణం చూపడం ద్వారా బోరు యజమాని నారాయణను అదుపులో పెట్టాలన్నది అవతలి రైతుల ప్రయత్నం. ఎలాగైనా వారి ప్రయత్నాలను అడ్డుకుని ప్రభుత్వ భూమిని సొంతం చేసుకోవాలన్నది నారాయణ ప్రయాస. ఈ వాస్తవాన్ని రెవెన్యూ అధికారులు కూడా ప్రైవేటు సంభాషణల్లో అంగీకరిస్తున్నారు. అటు ఇటూ కూడా ప్రభుత్వ భూమిలో కొంత భాగం ఇప్పటికే ఆక్రమణకు గురైంది కూడా. ఇరువర్గాలనుంచీ ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత ఇక రెవెన్యూ అధికారుల మీదే ఉంది.



నారాయణ భూమిలో ఉన్న బోరు - చదునుచేసిన నారాయణ భూమిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి

రూ.6.700 కోట్ల బకాయిలు విడుదల చేసిన సీఎం

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో వివిధ వర్గాలకు చెల్లించాల్సిన రూ.6,700 కోట్ల బకాయిల విడుదలకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులు, పోలీసులు, ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించాల్ని బిల్లుల విడుదలకు సీఎం ఆమోదం తెలపడంతో ఆయా వర్గాలు ఆనందంగా ఉన్నాయన్నారు. ఉద్యోగులకు జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు రూ.519 కోట్లు, పోలీసులకు సరెండర్ లీవ్ బకాయిలు రూ.214 కోట్లు, సీపీఎస్‌కు సంబంధించిన రూ.300కోట్లు, టీడీఎస్ కింద ఉన్న పెండింగ్ బిల్లులు రూ.265 కోట్లు చెల్లింపులకు ఆమోదం తెలిపారన్నారు. ఉద్యోగులకు మొత్తం రూ.1,300 కోట్లు విడుదల చేస్తున్నారని అన్నారు. 6.5 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.788 కోట్లు విడుదల చేయనున్నారని చెప్పారు. రూ.10 లక్షల లోపు బిల్లులున్న 26 వేల మంది కాంట్రాక్టర్లకు రూ.586 కోట్లు, అమరావతి, గన్నవరం విమానాశ్రయానికి భూమిలిచ్చిన రైతుల కౌలు బకాయిలు రూ.241కోట్లు చెల్లించనున్నారని వివరించారు. 6 వేల మంది చిరువ్యాపారులకు రూ.100 కోట్లు, ఎన్టీయార్ వైద్యసేవకు రూ.500 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.500కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.627 కోట్లు ఇలా వివిధ వర్గాలకు చెందిన రూ.6,700 కోట్ల బకాయిల విడుదలకు సీఎం ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌రాజ్, మేషాక్, శశికర్ బాబు, రఘు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

ఐదుగురికి గాయాలు ● ఒకరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన యువకుడు

వెదురుకుప్పం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చికాపల్లం నుంచి తిరుపతి వెళ్లే మార్గంలో ఎర్రగుంటపల్లి బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు, ఆటో ఆదివారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం ఎన్ఆర్‌కమ్మపల్లి మాదిగపల్లెకు చెందిన మణికంఠ(23), రమేష్(32), శ్వేత(27), అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం వారపు సంతకు వచ్చారు. సంక్రాంతి పండుగ సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసుకుని ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. ఎర్రగుంటపల్లి బస్టాప్ వద్ద వెళ్తుండగా తిరుపతి నుంచి పచ్చికాపల్లం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటో అదుపుతప్పి ఢీకొన్నాయి. ఆటో దెబ్బతింది. ఆటో నడుపుతున్న రమేష్ సహా మరో నలుగురు గాయపడ్డారు. వీరిలో మణికంఠకు కాలు విరిగిపోయింది. ఇతని పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని తిరుపతికి తరలించారు.

ఇన్‌చార్జ్ డీపీటీవో తనిఖీలు



బస్టాండులో తనిఖీలు నిర్వహిస్తున్న నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ డీపీటీవో నరసింహులు ఆదివారం తిరుపతి సెంట్రల్ బస్టాండులో ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్లాట్‌ఫారాల వద్ద కండక్టర్, డ్రైవర్ల పనితీరును పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను గమనించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆవరణలో విచ్చలవిడిగా ఆగివున్న బస్సులను చూసి ఆగ్రహించారు. వరుస క్రమంలో ఆపాలని, ఖాళీ పడినప్పుడు ప్లాట్‌ఫామ్ వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. రిజర్వేషన్ కౌంటర్లను పరిశీలించారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని దుకాణదారులకు సూచించారు.

టమోటా ధరలు పతనం

పొలాల్లోనే వదిలేస్తున్న రైతన్నలు



తోటలోనే వదిలిన టమోటాలు

సోమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టమోటా సాగు చేసిన రైతుల పరిస్థితి అయోమయంలో పడింది. ధరలు ఎప్పుడు పెరుగుతాయో.. ఎప్పుడు పతనమవుతాయో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. సోమల మండలంలో సీజన్‌తో సబంధం లేకుండా 300 ఎకరాలకు మించి టమోటా సాగు చేశారు. సెప్టెంబరు నెలలో నాట్లు వేసిన రైతులకు దిగుబడులు వస్తున్నాయి. రెండు నెలల క్రితం బహిరంగ మార్కెట్‌లో టమోటా ధర కిలో రూ.70 వరకు పలికింది. అయితే నేడు కిలో రూ.10 లోపు పలుకుతోంది. నాణ్యత ఉన్న 15 కిలోల బాక్సు రూ.100 నుంచి రూ.120 లోపు పలకడంతో గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండో రకం 15 కిలోల బాక్సు రూ.50 మాత్రమే పలకడంతో ఆందోళనలో పడ్డారు. ఈక్రమంలోనే కోతలు కోయకుండా తోటలోనే టమోటాలను వదిలేస్తున్నారు. పలమనేరు, పుంగనూరు, మదనపల్లె మార్కెట్లకు టమోటాలను తరలిస్తే రవాణా ఖర్చు బాక్సుకు రూ.20 మించి చెల్లించాలి. మండీలో 10 శాతం కమిషన్ కోత పడుతుంది. దినసరి కోత కూలీలకు రూ.400 చెల్లించి గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎకరా టమోటా సాగుకు రూ.1.50 లక్షలకు మించుతోంది. భారీ వర్షాలతో పంటలను కాపాడుకోవడానికి చీడపీడల నివారణకు అధిక వ్యయం చేసినా పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని తోటల్లో దిగుబడులు ఉన్నా మార్కెట్‌లో ధర లేకపోవడంతో పంటలను పొలాల్లోనే వదిలేస్తున్నారు.



బాక్స్ రూ.100 లకే అమ్ముకున్నాం

టమోటా ధరలు పూర్తిగా తగ్గిపోయి పెట్టిన ఖర్చు రాలేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.15 పలుకుతోంది. రైతుల నుంచి కిలో రూ.10 లకు కొనడం లేదు. ఎకరా సాగుకు రూ.1.50 లక్షలకు మించి ఖర్చు అవుతోంది. రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నాం. ఉద్యానాధికారులు స్పందించి టమోటా సాగు చేసిన రైతులకు చేయూతనివ్వాలి.

- అష్రఫ్ అలీ, టమోటా రైతు, నంజంపేట

ఎకరాలో సాగు చేసి నష్టపోయా!

ఎకరా టమోటా సాగు చేశా. లక్షకు మించి పెట్టుబడి పెట్టాను. దిగుబడి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో పంటకు చీడపీడలఓ కొంత దెబ్బ తింది. ఉన్న పంటతో పెట్టుబడి వస్తుందని ఆశపడ్డాం. ధరలు తగ్గిపోయి కోతలు చేయలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌కు తరలిస్తే రవాణా ఖర్చులు, మండీల్లో 10శాతం కమిషన్లు, కూలీ ఖర్చులతో పెట్టుబడులు రావడం లేదు. అధికారులు స్పందించి మండీల్లో కమిషన్లు 5 శాతం తీసుకునేలా చర్యలు తీసుకోవాలి.

- పీ.ఎస్. రాజ, టమోటా రైతు, సోమల



‘ట్రెక్ చిత్తూరు’కు విశేష స్పందన

గౌరీశంకరపురం నుంచి దేవరకొండకు నడక



దేవరకొండకు ట్రెక్కింగ్ చేస్తున్న అధికారులు, యువకులు



ప్రొఫెషనల్ ట్రెక్కర్‌ను అభినందిస్తున్న డీఎఫ్‌వో భరణి

బంగారుపాళ్యం, జనవరి12 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన ట్రెక్ చిత్తూరుకు విశేష స్పందన లభించింది. జిల్లా అటవీశాఖ అధికారి భరణి, నరేంధిరన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మొగిలి గౌరీశంకరపురం నుంచి దేవరకొండకు ట్రెక్ చిత్తూరు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎఫ్‌వో భరణి మాట్లాడుతూ ట్రెక్కింగ్ చేయడం వలన మానసికంగా, ఆరోగ్యంగా దృఢంగా ఉంటారని చెప్పారు. వీరు సుమారు 5 కిలో మీటర్లు నడిచి దేవరకొండకు చేరుకున్నారు. కొండపై వెలిసిన జలకంఠేశ్వరస్వామి వారిని దర్శించుకున్న వీరికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి బెంగళూరు, తిరుపతి, చిత్తూరు, పలమనేరు నుంచి పెద్దసంఖ్యలో యువత, ప్రొఫెషనల్ ట్రెక్కర్స్, ఎఫ్ఆర్‌వో నారాయణ, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



విష్ణు నివాసం వద్ద టోకెన్ల జారీ

ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ

తిరుపతి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్ల జారీ ప్రక్రియ తిరుపతిలో ఆదివారం ప్రశాంతంగా కొనసాగింది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి టోకెన్లు 9వ తేదీన జారీచేసిన విషయం తెలిసిందే. మిగిలిన ఏడు రోజులకు సంబంధించిన టోకెన్ల జారీ ప్రక్రియ ఆదివారం రాత్రి 9.30 గంటలకు బస్టాండు సమీపంలోని శ్రీనివాసం కాంప్లెక్సులో ప్రారంభించారు. విష్ణునివాసంలో సాయంత్రం 5.25 గంటల వరకు 13వ తేదీ టోకెన్లను జారీ చేశారు. అనంతరం 14వ తేదీకి సంబంధించి టోకెన్ల ప్రక్రియ కొనసాగింది. 14 కౌంటర్ల ద్వారా మంజూరు చేస్తున్నారు. భూదేవి కాంప్లెక్స్‌లో ఆదివారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ భక్తులకు టోకెన్లను అందించారు.

శ్రీవారి పరకామణిలో బంగారు బిస్కెట్ చోరీ

కాంట్రాక్ట్ ఉద్యోగిని అరెస్ట్ చేసిన పోలీసులు



బంగారు బిస్కెట్ - పెంచలయ్య

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ కానుకలు లెక్కించే పరకామణి భవనంలో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి ఏకంగా బంగారు బిస్కెట్‌ను దొంగిలించి పట్టుబడ్డారు.ఖాళీ ట్రాలీ నుంచి బయటకు పంపి ఆ తర్వాత తీసుకోవాలనే అతని ప్లాన్‌ను విజిలెన్స్ శాఖ బయటపెట్టింది. సాధారణంగా కానుకలతో నిండిన హుండీలను సీల్ వేసి ఆలయం వెలుపల ఉన్న పరకామణి భవనానికి పంపుతారు. హుండీలో వచ్చిన కానుకలను అక్కడ వేరు చేసి లెక్కిస్తారు. టీటీడీ ఉద్యోగులు, పరకామణి సేవకులు, అగ్రిపోస్ సంస్థ ద్వారా మరికొంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ పనులు చేస్తారు.వీరిలో అగ్రిపోస్ నుంచి పెంచలయ్య అనే కాంట్రాక్ట్ ఉద్యోగి పరకామణిలో శనివారం విధులకు హాజరయ్యాడు. కొన్ని వస్తువులతో కూడిన ట్రేతో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్ ఫ్లోర్‌కు చేరుకుని గోల్డ్ రూమ్‌లోకి వెళ్లాడు. ప్లాస్టిక్ ట్రేలలో నిల్వచేసిన బంగారు వస్తువుల దగ్గరకు వెళ్లి 100 గ్రాముల బరువున్న గోల్డ్ బిస్కెట్‌ను మలవిసర్జన ద్వారం వద్ద దాచి కింది ఫ్లోర్‌కు చేరుకున్నాడు. అక్కడ దారంతో బంగారు బిస్కెట్‌ను చుట్టి 17వ నెంబరు ఖాళీ ట్రేలోని పైప్ రంధ్రంలో దాచి చెకింగ్ ప్రాంతానికి పంపేశాడు.పరకామణి భవనంలో పటిష్టమైన సీసీ కెమెరాల వ్యవస్థ ఉండటంతో ఈ వ్యవహారం మొత్తాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించి పెంచలయ్యను అదుపులోకి తీసుకుని తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

చౌడేపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వర్ణాభరణాలతో అలంకరించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

క్రీడాపోటీల్లో యువత పోటీపడాలి



సోమలలో క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

సోమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో యువత స్నేహపూర్వకంగా పాల్గొనాలని విశ్రాంత ఆర్మీ అధికారి సీజీ రెడ్డెప్ప, సుమన్ టీవీ సోమశేఖర్ సూచించారు. ఆదివారం స్థానిక హైస్కూల్‌లో శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో సుమన్ టీవీ ప్రోత్సాహంతో 14 టీముల మధ్య పోటీ హోరాహోరీగా సాగాయి. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రోత్సాహక నగదు, మెడల్ అందజేశారు. అలాగే క్రీడాకారులకు నాలుగు రోజులు భోజన సౌకర్యం కల్పించిన దాత కామిశెట్టి నగేశ్‌ను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు వినయ్, అభిషేక్, శంకర్ రెడ్డి, అనిల్, నవీన్ రాయల్, జగన్‌మోహన్, చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

కరకమందలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

సోమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కరకమందలో ప్రేరణ సంస్థ నిర్వాహకులు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ప్రారంభించారు. నంజంపేట ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్, శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్, కందూరు, పెద్దఉప్పరపల్లె, ఇరికిపెంటల్లో పలు టోర్నమెంట్లు ప్రారంభమయ్యాయి.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మునస్వామి తదితరులు

రామకుప్పం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పెద్దకురబలపల్లెకు చెందిన గోవిందప్ప భార్య తిప్పమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం స్థానిక నేతలతో కలిసి తిప్పమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులకు వారు పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నేతలు ఎర్రప్ప, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, హనుమంతు, పెరియప్పయ్య, మురుగేష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి కల్యాణోత్సవాలు



రామకుప్పం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం ఆధ్వర్యంలో రామకుప్పం మండలంలో శని, ఆదివారాల్లో దళితవాడల్లో స్వామి వారి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి రామకుప్పం శివాజీనగర్ కాలనీలో ఆదివారం ఉదయం బందార్లపల్లె దళితవాడలో మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య సిద్ధి, బుద్ధి, వినాయకస్వామి వారి కల్యాణోత్సవాలను అర్చకులు ఉన్నికృష్ణన్ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదపండితులు గణేష్‌కుమార్ శర్మ, రఘునందన్, ఆలయ సిబ్బంది హరి, జయచంద్ర, కిరణ్, బాలాజీ, యుగంధర్, వాసు, విజయ్ పాల్గొన్నారు.

రన్నింగ్ పోటీల్లో కార్తీక్‌కు బంగారు పతకం



కార్తీక్‌కు గోల్డ్‌మెడల్ అందిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్

చౌడేపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో చౌడేపల్లెకు చెందిన కార్తీక్ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఆదివారం చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ నుంచి బంగారు పతకాన్ని అందించారు. కాగతి పంచాయతీ చిన్నఓబునపల్లెకు చెందిన రామ్మూర్తి కుమారుడు డి.కార్తీక్ కుప్పంలోని కళాశాలలో ఈసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుప్పం ద్రవిడ వర్సిటీలో జరుగుతున్న క్రీడాపోటీల్లో 1500 మీటర్ల రన్నింగ్‌లో మొదటి స్థానం సాధించాడు. అలాగే బాల్ బ్యాడ్మింటన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన సైపుల్లా

పలమనేరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-కుప్పం జాతీయ రహదారిపై పలమనేరు మండలం కూరుమాయి వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం గ్రామానికి చెందిన సైపుల్లా(40) మృతిచెందాడు. ద్విచక్రవాహనంపై కొలమాసనపల్లి గ్రామానికి వస్తుండగా కూరుమాయి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలి



హరీష్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

రామకుప్పం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ పటిష్టతకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నరేష్ కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలను ప్రతి కార్యకర్త, నేతలు గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో యువత, మహిళలు పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చూడాలన్నారు. అనంతరం రామకుప్పం మండల అధ్యక్షులు హరీష్ జన్మదినం సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి భాస్కర్, నేతలు శ్రీకాంత్, రఘురామ్, పవన్, సురేష్, గంగాధర్, భాను, మహేష్, సుభాన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ భానుమూర్తిరెడ్డి

పుంగనూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అభాగ్యులైన పేద ప్రజలను ఆదుకోవడానికి లయన్స్ క్లబ్‌లు వేర్వేరుగా ట్రస్టులు ఏర్పాటు చేసి సేవలను విస్తృతం చేయాలని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ భానుమూర్తిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బోయకొండ వద్ద జరిగిన లయన్స్‌క్లబ్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలపై ఆసక్తి ఉన్న వ్యక్తులకు లయన్స్‌క్లబ్‌ల్లో సభ్యత్వాలు ఇచ్చి ప్రతిక్లబ్ పటిష్టం కావడానికి కృషి చేయాలని కోరారు. పుంగనూరు లయన్స్‌క్లబ్ డయాలసిస్ కేంద్రం, మదనపల్లె లయన్స్ కంటి ఆసుపత్రి పేదలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రామచంద్రన్, అశ్వర్థనారాయణ, ప్రతాప్‌యాదవ్, జి.గౌతమ్‌రెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ శివ, మనోజ్‌కుమార్ రెడ్డి, రాజారెడ్డి, ముత్యాలు, మహిపాల్‌రెడ్డి, పుంగనూరు, బెంగళూరు, మదనపల్లె, సదుం, కలకడ, తిరుపతి, చిత్తూరు, హార్సిలీ హిల్స్, పీలేరు, నగరి లయన్స్‌క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

చౌడేపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ చౌడగానిపల్లెకు చెందిన రైతు నరసింహులుకు చెందిన గడ్డివామిలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గుర్తించిన గ్రామస్థులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి సుబ్బరాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సుబ్రహ్మణ్యం, ప్రసాద్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వన్‌మ్యాన్ కమిషన్ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న చిత్తూరులో జరిగే వన్‌మ్యాన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా సభకు తరలిరావాలని జాతీయ ఎమ్మార్పీఎస్ నాయకులు నరేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని షెడ్యూల్ కులాల్లోని 50 ఉపకులాలకు చెందిన వారందరూ తరలిరావాలని కోరారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకై వన్‌మ్యాన్ కమిషన్‌ను నియమించిందన్నారు. ఆ కమిషన్ ఎదుట ఉపకులాల సమస్యలను తెలియజేయాల్సి ఉందన్నారు. మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు దుద్దు రామకృష్ణమాదిగ, మురళీ, ప్రకాశ్, రఘునాథ్, నాగభూషణం, నరసింహులు, శ్రీనివాసులు, చిట్టి, సూరి, వెంకటరమణ, ప్రభుకుమార్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సీఐ శ్రీనివాసులు

పుంగనూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందేలు, పేకాట తదితర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా యువత కోడి పందేలు, పేకాట ఆడటానికి సిద్ధమవుతారని, నిషేధిత పనులు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కోడిపందేలు, పేకాట పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఆటలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 100, 112, 9440796773 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన పుంగనూరు జనసేన నాయకులు



డిప్యూటీ సీఎంను కలిసిన వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఆదివారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో పుంగనూరు జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తున్నట్లు వివరించారు. నాయకులు దాసిరి రాఘవ, శివకుమార్‌రెడ్డి, విరూపాక్షి, తదితరులు డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

గృహనిర్మాణాలు పూర్తయ్యేనా..!

- జగనన్న కాలనీలో పునాదులే దర్శనం
- వసతుల కొరతతో ఆగిన పనులు
- కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల చూపు



కాలనీ వీధుల్లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు



పనులు ఆగిపోవడంతో పునాదులకే పరిమితమైన కట్టడాలు



ఏఎంసీ మార్కెట్‌కు ఎదురుగా పునాదుల వద్ద ఉన్న నీటి నిల్వలు

సోమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పేరిట ఆర్భాటం చేసి జగనన్న కాలనీలు అంటూ గృహాలు మంజూరు చేసినా వసతుల కొరతతో నేటికీ పునాదులే దర్శనమిస్తున్నాయి. కాలనీ లేఅవుట్లలో రహదారులు, విద్యుత్, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారుల సొంతింటి ఆకాంక్ష కలగానే మిగిలింది. సోమల మండలం సోమల-కందూరు మార్గంలోని ఏఎంసీ మార్కెట్‌కు ఎదురుగా ఉన్న కాలనీలో ఒక ఇల్లు సైతం గృహప్రవేశానికి నోచుకోలేదు. రాళ్లతో నిండిన గుట్టలో పునాదులు తీయడానికి వేలకు వేలు ఖర్చు చేసుకున్నారు. నిరుపేదలకు ఊరికి దూరంగా గుట్టలో బండపైన లేఅవుట్లు వేసి 60 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణ పనుల వేగం కోసం పలుమార్లు అధికారులు గడువులు ఇచ్చి పూర్తి చేయాలన్నారు. ఇంటి సామాగ్రి ధరలు పెరగడంతో ఇంటి నిర్మాణం భారంగా మారింది. దీంతో కొందరు మాత్రమే సొంత డబ్బులతో అరకొరగా సగం పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు ఆపేశారు. రెండు ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. కొండ సమీపంలో గృహ ప్రవేశం చేయలేక విద్యుత్, నీటిసౌకర్యం లేకపోవడం, ఇళ్ల మధ్య మట్టి రోడ్డులో మొక్కలు పెరిగిపోయి దారి మూసుకుపోవడంతో లబ్ధిదారుల సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. పూర్తి కాని ఇళ్లకు లక్షల్లో పెట్టుబడులు పెట్టలేక పనులు ఆపేశారు. అప్పు చేసి ఇళ్లు పూర్తి చేద్దామంటే చేసిన అప్పు తీరక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆగిపోయిన నిరుపేదల గృహాల నిర్మాణానికి చేయూతనివ్వాలని ఎదురు చూస్తున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



సుబ్రహ్మణ్యంకు ఆర్థిక సహాయం అందజేస్తున్న బలిజకాపు సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ఇరువర్గాల ఘర్షణలో గాయపడిన సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆదివారం బలిజకాపు సంఘ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని ప్రసన్నయ్యగారిపల్లె సమీపంలో భూసర్వే సందర్భంగా రెండు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఆర్థిక పరిస్థితి బాగ లేదని గుర్తించిన బలిజ కాపు సంఘ నాయకులు రూ.22,650 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పగడాల రమణ, కుమార్‌రాయల్, పూల భాస్కర్, రాఘవ, జనార్ధన్, మోహన్, సురేశ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు కవులకు ఘన సన్మానం



పుంగనూరు కవులను సన్మానిస్తున్న కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్

పుంగనూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కవులు, రచయితలను చిత్తూరు రచయితల సంఘం, కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరలో ఘనంగా సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాగయ్య కళా క్షేత్రంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లా పరిధిలోని కవులు, రయిచతలు, సాహితీ వేత్తలను సన్మానించినట్లు ఆ సంఘ అధ్యక్షుడు పరాంకుశ నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు బాషా, సాహిత్యాన్ని బావితరాలకు తెలియజేయడానికి కవులు, రచయితలు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పుంగనూరుకు చెందిన కవులు, రచయితలు పరాంకుశ నాగరాజ, సతీష్‌రాజు, హసీనాబేగం, గాయిత్రిదేవీ, శ్రవంతిలను చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్, ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాకృష్ణ మనవడు సుబ్రహ్మణ్యం శర్మ ఘనంగా సన్మానించారు.

బీసీల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ఎస్ నాయకులు గంగరాజు

పుంగనూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి బీఆర్ఎస్ఎస్ సంఘం పనిచేస్తోందని ఆ సంఘ జిల్లా నాయకుడు గంగల గంగరాజు తెలిపారు. ఆదివారం స్థానికంగా జరిగిన బీసీ సంఘ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఐక్యంగా ముందుకెళ్లాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కృష్ణమూర్తి, చిట్టెమ్మ, షాబానా, చైత్ర, శ్రీనివాసులు, సీతారామయ్య, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.


వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వెంకటేశ్

పుంగనూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని హిందూ సత్యధర్మ దివ్య జ్ఞాన జ్యోతి సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్ కోరారు. వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక త్యాగరాజ స్వామి కళామందిరంలో విద్యార్థులకు గత మూడు రోజులుగా వివిధ రకాల వ్యాస రచన, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మణికంఠ, హేమంత్‌కుమార్, భద్రయ్య, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ క్రికెట్ పోటీల ప్రారంభం



చౌడేపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏటా నిర్వహిస్తున్న క్షత్రియ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ఆదివారం దాదేపల్లె సమీపంలోని నారాయణరాజు స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ప్రముఖ పారిశ్రామిక వేత్త పురుషోత్తమరాజు, మాజీ టీడీపీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్షత్రియ యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అ 'పూర్వ' కలయిక



పెనుమూరులో అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుమూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు జూనియర్ కళాశాలలో 2005-07 ఏడాది ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. అధ్యాపకులు నరసింహులు, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డిలను అహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, రంగస్వామి, ఏకాంబరం, నరేష్, అమర్, శాంతి, జ్యోతి, స్వాతి, యువరాజు, ఉదయ్, జీవరత్నం, గుర్రప్ప, హేమలత, లత, భాను, కార్తీక్, చంద్ర, పాల్గొన్నారు.

గుడిపాల: చదువుకునే రోజుల్లో అప్పటి జ్ఞాపకాలను ఇప్పటికీ మరిచిపోలేమని పూర్వవిద్యార్థులు అన్నారు. మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో 2010-11 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు గెట్ టు గెదర్ నిర్వహించారు.

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లి ఉన్నత పాఠశాలలో 1977-78 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనంజరిగింది. అప్పటి ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను దుశ్శాలువలు, గజమాలలతో పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శంకర్‌నాయుడు, గల్లా రంగనాథంనాయుడు, శేషారెడ్డి, విశ్వనాథరెడ్డి, గంగులు నాయుడు, పూర్వ విద్యార్థులు లంకిపల్లి మహదేవనాయుడు, అద్దంకి జయరామనాయుడు, గల్లా రాధాక్రిష్ణ, మునీశ్వరన్ పాల్గొన్నారు.

అంధకారంలో కాటిపేరి

చౌడేపల్లె, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కరెంటు లేకుండా శనివారం రాత్రి నుంచి కాటిపేరి గ్రామస్థులు అంధకారంలో గడుపుతున్నారు. మండలంలోని కాటిపేరి గ్రామానికి విద్యుత్తు సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్ మర్మతులకు గురికావడంతో శనివారం రాత్రి 8 గంటలకు సరఫరా ఆగిపోగా ప్రజలు చీకట్లోనే ఉంటున్నారు. రెండో రోజైనా ఆదివారం రాత్రి 9 గంటలైన విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో ప్రత్యామ్నయం ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ శశిధర్‌ను వివరణ కోరగా ఆయన లైటింగ్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని.. పనిచేయలేదని తెలిపారు. దీంతో ఆదివారం సైతం చీకట్లోనే గడాల్సిన పరిస్థితి నెలకొంది.

సంక్రాంతికి పెరిగిన కూరగాయల ధరలు



కందూరు వారపు సంత

సోమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం కందూరు వారపు సంతలో కూరగాయలు అధిక ధరలు పలికాయి. బెండ, బీర, దొండకాయలు కిలో రూ.80 లకు పైగా పలకడంతో పేద ప్రజలు కొనలేకపోయారు. కిలో అనపకాయలు వంద పలకడంతో అర్ధకిలోతో సర్దుకున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

సోమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సోమల బస్టాండులో ద్విచక్ర వాహనాన్ని వదిలి శనివారం సాయంత్రం కల్లూరులో సినిమాకు వెళ్లిన యువకుడి పల్సర్ వాహనం అదృశ్యమైనట్లు సోమల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమలకు చెందిన రాజ (వడ్ల) శనివారం సాయంత్రం బస్టాండ్ వద్ద ద్విచక్రవాహనాన్ని వదిలి కల్లూరులో సినిమాకు మిత్రులతో కలిసి వెళ్లాడు. రాత్రి సినిమా అనంతరం సోమల బస్టాండ్‌కు వచ్చి పల్సర్ వాహనం కోసం గాలించాడు. ఆచూకీ లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శిథిలావస్థలో శివాలయ భవనం



పలమనేరులో మూడు దశాబ్దాలుగా శిథిలావస్థలో ఉన్న శివాలయం భవనం

పలమనేరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఓ భవనం గత మూడు దశాబ్దాలుగా శిథిలావస్థలో ఉంది. పలమనేరులో ఎప్పుడూ రద్దీగా ఉండే గంగమ్మగుడి వీధిలో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఈ భవనంలో మూడు దశాబ్దాల క్రితం శాఖా గ్రంథాలయం ఉండేది. అయితే భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం శాఖా గ్రంథాలయానికి స్థానిక బాలికోన్నత పాఠశాల సమీపంలో నూతనంగా నూతన భవనం నిర్మించడంతో శాఖా గ్రంథాలయం ఆ భవనంలోకి మారింది. అయితే అప్పటి నుంచి ఈ భవనం వృథాగా మారింది. ఇకనైనా దేవదాయశాఖ అధికారులు స్పందించి వాణిజ్య సముదాయం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సొంత భవనాలకు నోచుకోని సచివాలయాలు



ఐదో వార్డు సచివాలయం

పలమనేరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీకి వివిధ పథకాలతో కోట్లాది రూపాయలు వస్తున్నా మున్సిపాలిటీలోని సచివాలయాలకు సొంత భవనాలు నిర్మాణాలకు నోచుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థను కొత్తగా తీసుకొచ్చింది. మున్సిపాలిటీలో 2019లో 12 చోట్ల వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలోని 26 వార్డులకు గాను 12 వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఇందులో మూడు మినహా నేటికి 9 సచివాలయాలు అద్దె భవనాల్లో ఉంటున్నాయి. ప్రతినెలా వీటికి ఒక్కో అద్దె భవనానికి రూ.7 నుంచి రూ.10 వేలు మేరకు అద్దెలు చెల్లిస్తున్నారు. ఇక మిగిలిన మూడు సచివాలయాలు ప్రభుత్వ భవనాల్లోనే ఉంటున్నాయి. ఇకనైనా మున్సిపల్ అధికారులు మున్సిపాలిటీలోని సచివాలయాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

చంద్రబాబుకు ఎంపీ, ఎమ్మెల్యేల ఘన స్వాగతం




రేణిగుంట/ వెదురుకుప్పం/ నగరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.

గోదాదేవికి విశేష పూజలు

నగరి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): నగరి మన్సిపాలిటీ పరిధిలోని కరియమాణిక్యస్వామి ఆలయంలో గోదాదేవికి ఆదివారం ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. సోమవారం గోదాదేవి అమ్మవారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా భక్తులు పసుపును దంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ ఈఓ రమణ ఏర్పాట్లు చేపట్టారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

చిత్తూరు కల్చరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఓం కేశవరెడ్డి ట్రస్ట్, రచయితల సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు కోలాహలం గా జరిగాయి. మొదట స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి కళాకారులు నగరపాలక నాగయ్య కళాక్షేత్రం వరకు ప్రదర్శనగా వచ్చారు. ప్రధాన అతిథిగా విచ్చేసి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలను చిత్తూరులో అత్యంత ఘనంగా నిర్వహించడంతో పాటు ఉత్తమ రైతులకు నగదు పురస్కారం, కవులకు, కళా కారులకు సత్కారాలు చేస్తామని తెలియజేశారు. మరో ప్రధాన అతిథి సర్వేపల్లె సుబ్రమణ్యేశ్వర శర్మ మాట్లాడుతూ గ్రామాలు సుభిక్షంగా ఉంటేనే దేశం బాగుంటుందని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మహిళలతో కలిసి కోలాటం వేశారు. గొబ్బెమ్మల ఆటపాటలు, గంగిరెద్దుల కళాకారులతో కలిసి సందడి చేశారు. కళాకారులను, సాహితీ వేత్తలను సత్కరించారు. ఓం శ్రీధర్‌రెడ్డి, బీవీరెడ్డి సౌమినిరెడ్డి, డా. రామలక్ష్మి, పార్థసారథి నాయుడు, వీకే.విశ్వనాథ్, రచయితల సంఘం ప్రతినిధులు, మనసంస్కృతి నిర్వాహకులు పాల్గొన్నారు.



నాగయ్య కళాక్షేత్రంలో గంగిరెద్దుల సందడి



కోలాటమాడుతున్న ఎమ్మెల్యే గురజాల

తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపిక

వెదురుకుప్పం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరం మం డలం గంగమాం బా పురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న కరణం గిరిబాబు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ నుంచి సమాచారం అందింది.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

పాలసముద్రం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని క్రిష్ణజిమ్మా పురానికి చెందిన గోవిందమందడి ఆదివారం రాత్రి సొంతపనిపై బలిజకండ్రిగకు వచ్చాడు. పనులు పూర్తిచేసుకుని స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని ధర్మరాజుల ఆలయం వద్ద వెనుక నుంచి వచ్చిన కర్ణాటకకు చెందిన ఓ కారుఢీకొంది. గోవింద మందడికి తీవ్ర గాయాలు కావడంతో 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారులోని వ్యక్తి పరారయ్యాడు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప కేసు నమోదు చేశారు. కారును స్వాధీనం చేసుకున్నాడు.

117 జీవో రద్దుపై హర్షం

గంగాధరనెల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అనాలోచితంగా, అప్రజస్వామికంగా విడుదల చేసిన 117 జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై రాష్ట్ర తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కె. యుగంధాచారి హర్షం వ్యక్తం చేశారు. అలాగే జీపీఎఫ్ రూ. 519 కోట్లు, సీపీఎస్‌కు రూ. 300 కోట్లు, టీడీఎస్‌కు రూ. 205 కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంటుకు రూ. 785 కోట్ల బకాయిలు విడుదల చేయడంపై సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు సన్మానం

నగరి, జనవరి12 (ఆంధ్రజ్యోతి) రెవెన్యూ మంత్రి అనగాని ప్రసాద్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు హరి తిరుచానూరులో ఆదివారం కలిశారు. శాలువాతో సన్మానించారు.

పల్లెలకు పండుగ శోభ

పాలసముద్రం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో సంక్రాంతి సందడి మొదలైంది. పట్టణాల నుంచి ప్రజలు గ్రామాలకు కుటుంబాలతో కలసి తరలివచ్చారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పూతలపట్టు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని వావిల్ తోట పంచాయతి పరిధిలోని లక్ష్మయ్యవూరు, మూర్తిగాని వూరు, నొచ్చుపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు యువరాజులు నాయుడు, నాయకులు మధు, గోవర్ధన్, నాదముని, రామమూర్తి నాయుడు, భార్గవ్, జగన్నాథం, జయప్రకాష్, దాము, బాలక్రిష్ణమనాయుడు, రామచంద్ర నాయుడు, నరసింహులు, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని చిగరపల్లెలో గోకులం షెడ్డును ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు మధుసూదన రావు, లత, పూర్ణచంద్ర, లత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



కమ్మ సంఘం క్యాలండర్ ఆవిష్కరణ

తవణంపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.పట్నం సమీపంలో కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ కమ్మ అభ్యుదయ సేవా సంఘం పూర్తిగా కమ్మవారి సమైక్యత, అభివృద్ధి సహాయ సహకారాల వేదిక మాత్రమేనన్నారు. అమరరాజా వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి, నెక్ రమేష్, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు ముగ్గులు



బహుమతి అందిస్తున్న గురజాల జీవన్

చిత్తూరు అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ముగ్గుల పోటీ అని ఎమ్మెల్యే తమ్ముడు గురజాల జీవన్ అన్నారు. ఆదివారం నగరంలోని 31వ డివిజన్‌లోని గంగాక్రాస్‌లో కో-ఆప్షన్ సభ్యులు కోలా కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ జరిగింది. డివిజన్ పరిధిలో 45 మంది మహిళలు వివిధ రకాల ముగ్గులను వేశారు. అనంతరం న్యాయ నిర్ణేతలు ముగ్గులను ఎంపిక చేశారు. మొదటి ఐదుగురికి గ్యాస్ స్టవ్, ప్రెషర్ కుక్కర్, కిచెన్ కిట్‌లను అందించారు. పోటీలో పాల్గొన్న మిగిలిన వారందరికీ హాట్‌బాక్స్‌లను పంపిణీ చేశారు.

పల్లెలో ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు

విజయపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. సోమవారం భోగి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని భోగి మంటలు వేయడానికి ముళ్ల కంపలను, చెరకు ఆకులను, పెద్ద మొక్కలను సేకరించారు.

ప్రముఖుల సంక్రాంతి శుభాకాంక్షలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆదివారం ముందస్తు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా ఇన్‌చార్జి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, కలెక్టర్ సుమిత్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కాంచర్ల శ్రీకాంత్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వి.ఎం.థామస్, జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీఆర్వో మోహన్ కమార్ ఉన్నారు.

నేడు గోదాదేవి కల్యాణం

చిత్తూరు కల్చరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయంలో మంగళవారం మధ్యాహ్నం ధనుర్మాస గోదాదేవి కళ్యాణం నిర్వహిస్తున్న ట్లు ఆలయ ఈవో సుబ్రమణ్యంనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నేత వరదరాజులుకు నివాళి



యాదమరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి వరదరాజులు గుండె పోటుతో శనివారం మృతి చెందారు. ఆదివారం ఆయన స్వగ్రామమైన తెల్లరాళ్లపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఐ నాయకులు, డీహెచ్‌పీఎస్ నాయకులు, దళితనేతలు, ఎమ్మార్పీఎస్ నేతలు నివాళులర్పించారు. ఆయన మరణం దళిత ఉద్యమానికి తీరని లోటు అన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, చంద్ర, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వి.దామోదరం, మునస్వామి, టీడీపీ ఎస్సీసెల్ నాయకులు రాజ, రఘు, సుందరం, భాస్కర్, నాగరాజు, రమేష్, టి.గోపి, మాణిక్యం, గురుశంకర్, అమరావతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా హేమావతి

చిత్తూరు అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు నగరానికి చెందిన హేమావతిని ఎంపిక చేశారు. రెండు రోజుల క్రితం తిరుమలకు వచ్చిన ఆ సంఘ జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం తన కార్యాలయంలో హేమావతిని నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా షణ్ముగం మాటాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీసీ సంక్షేమ సంఘాలను గ్రామస్థాయి నుంచి పటిష్టపరిచి త్వరలో జాతీయ అధ్యక్షులు కృష్ణయ్యతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. ఆ సభలోనే జిల్లా కమిటీలను ప్రకటి స్తామని తెలిపారు.

వైసీపీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శిగా రజినీకాంత్



గుడిపాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పార్టీలో కష్టానికి తగ్గ గుర్తింపు ఇచ్చారని వసంతాపురం సర్పంచ్ ఎస్.ఎస్. రజినీకాంత్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వైసీపీ కార్య నిర్వహణ కార్యదర్శిగా పదవి ఇచ్చిందన్నారు. పార్టీ పటిష్టతకు తనవంతు కృషిచేస్తానని తెలియజేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డికి, జిల్లా వైసీపీ నాయకుడు విజయానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



విద్యార్థుల మధ్య వివేకానందుడి వేషధారణలో హెచ్‌ఎం కేశవులు

వెదురుకుప్పం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎం పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని హెచ్‌ఎం కేశవులు ఆధ్వర్యంలో 'జాతీయ యువజన దినోత్సం' ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద వేషదారణలో హెచ్‌ఎం కేశవులు కనిపించారు. వివేకానంద గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, ఉపాధ్యాయులు రంజిత్‌కుమార్, బొబ్బిలిరెడ్డి, యువత లీడర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యస్ కార్యవర్గం ఏర్పాటు

చిత్తూరు రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యాదవ ఎంప్లాయీస్ సొసైటీ (యస్) చిత్తూరు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సలహాదారుడు చిట్టిబాబు తెలిపారు. నియోజకవర్గ గౌరవాధ్య క్షుడుగా సుబ్రమణ్యం, అధ్యక్షుడుగా విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా చిట్టిబాబు, ఆర్థిక కార్యదర్శిగా శ్రీధర్, ఉపాధ్యక్షుడుగా లక్ష్మీప్రసాద్, అదనపు కార్యదర్శిగా గోవిందస్వామి ఎన్నికయ్యారు. అనంతరం సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్లను సొసైటీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సొసైటీ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సొసైటీ నాయకులు

అ 'పూర్వ' కలయిక

పెనుమూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు జూనియర్ కళాశాలలో 2005-07 ఏడాది ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. అధ్యాపకులు నరసింహులు, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డిలను అహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. ఆనాటి తీపి జ్ఞాప కాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, రంగస్వామి, ఏకాంబరం, నరేష్, అమర్, శాంతి, జ్యోతి, స్వాతి, యువరాజు, ఉదయ్, జీవరత్నం, గుర్రప్ప, హేమలత, లత, భాను, కార్తీక్, చంద్ర, పాల్గొన్నారు.

గుడిపాల: చదువుకునే రోజుల్లో అప్పటి జ్ఞాపకాలను ఇప్పటికీ మరిచిపోలేమని పూర్వవిద్యార్థులు అన్నారు. మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో 2010-11 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు గెట్ టు గెదర్ నిర్వహించారు.

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లి ఉన్నత పాఠశాలలో 1977-78 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనంజరిగింది. అప్పటి ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను దుశ్శాలువలు, గజమాలలతో పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శంకర్‌నాయుడు, గల్లా రంగనాథంనాయుడు, శేషారెడ్డి, విశ్వనాథరెడ్డి, గంగులు నాయుడు, పూర్వవిద్యార్థులు లంకిపల్లి మహదేవనాయుడు, అద్దంకి జయ రామనాయుడు, గల్లా రాధాక్రిష్ణ, మునీశ్వరన్, గిరికుమార్, దొరస్వామి పాల్గొన్నారు.





పూతలపట్టులో పూర్వవిద్యార్థులు, పెనుమూరులో అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు, చిత్తూరు నరహరిపేట హైస్కూల్ పూర్వ విద్యార్థులు